


# మనిషి-మనసు

'శ్రీ నేతగాని'

భయంకరమైన చీకటిరాత్రి. ఆకాశంలో నల్లని మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయ్. విసురుగా గాలి వీస్తోంది. సన్నగా జల్లు పడుతోంది. అప్పుడప్పుడు మేఘాలు వురుముతున్నాయ్. మెరుపులు క్షణికమైన వెలుతురు లోకానికందిస్తూ అంతలోనే అదృశ్యమై పోతున్నాయ్ చూస్తూండగానే వర్షం అధికమైంది.

అదొక పట్టణ వెలుపలి ధర్మసత్రం. అంతా గబ్బిలాల కంపు! నానా జాతి దీనవారికి నిలయం. ఎన్నేళ్ళయిందో సత్రం కట్టి. కూలి మీద పడుతుందేమో అన్నట్టుగా వుంటుంది. అలానే ధైర్యం చేసి నీడలేని నిరుపేదలు అక్కడే తల దాచుకుంటారు. వారికి అంతకంటే గత్యంతరం లేదుమరి. సత్రానికి ఎదురుగా వున్న చింతచెట్టు గాలికి అటూ ఇటూ వూగుతూ జుట్టు విరబోసికున్న దయ్యంలా అగుపిస్తుంది. దూరాన ఎక్కడో పిడుగు పడిన శబ్దం వినిపించింది. కొంచెం సేపటిలో వర్షం తగ్గుముఖం పట్టింది. గాలి విపరీతంగా వీస్తోంది.

మానవుడు జీవితంలో దేనినైతే తన ప్రాణంగా ఎంచుకుంటాడో ఆ ప్రియమైన దానికి మరొకరి ద్వారా అన్యాయం జరగడం సంభవిస్తే హృదయం క్రోధంతో నిండిపోతుంది. మానవుడప్పుడే దానవుడుగా మారవచ్చు. తన జీవితం ఏమైనా తనేమైనా లెక్క చేయడు. గమనించడు కూడా! తన హృదయంలో బుసలు కొడుతున్న పగ చల్లారే వరకు అన్వేషణ సాగిస్తూనే వుంటాడు.

శాంతీ! శాంతీ... నన్ను క్షమించు శాంతీ! నీవు రమ్మని కోరిన ప్రకారం నేను వచ్చుంటే నేనిలాంటి నరకయాతన పడవలసిన అవసరమే వుండేదికాదు. నా కర్తవ్యానికి ఇలాంటి శాస్తి జరగాల్సిందే! కాని... శాంతీ! నేను చేసిన పాపమేమిటి? ఎందుకు నాకీశిక్ష? ఒక్కసారి నీ అమృత పెదవులతో మనసారా నన్ను క్షమించానను. అప్పుడే నాహృదయానికి శాంతి లభిస్తుంది. నే నీ భయంకర జీవితాన్ని జీవించలేను శాంతీ... హే భగవాన్! ఎందుకు నాపై నీకింత కక్ష? ఏమిటి నీ పక్షపాతం? నాజీవితాన్ని ఎందుకు శ్మశానంగా మార్చావు? ఎందుకిలా రంపపుకోతతో కన్నీటి గాథగా మార్చావు? పచ్చగా సాగిపోతున్న నా సంసారంలో ఎందుకీ అగ్నిపర్వతాన్ని పేల్చావు? నాలాటివారి జీవితాలతో ఇలా చెలగాటమాడటం నీకు సరదాగా వుంటుందా? అసలు నీ వంటూ వుంటే, నేను చేయని నేరానికి ఎందుకీ మోయలేని శిక్షవిధించావు. నీవు నిజంగా పక్షపాతం కలవాడివి. ఒక్కరోజు వెళ్ళనందుకే ఇంత ఘోరమా? ఇంత నరకమా? ఇదేనా నీ న్యాయం, ధర్మం? మాట్లాడవేం? ...లామాట్లాడతావు. ఏమని మాట్లాడతావు. నన్నుకూడా తీసుకో. అప్పుడు నీకళ్ళు చల్లగా వుంటాయనుకొంటాను. త్వరగా తీసుకుపో...!" అంటూ ఆవేశంగా అరిచాడు సత్యం. పసిపిల్లవానిలా భోరున ఏడ్చాడు.

తృళ్ళిపడిలేచాడు సత్యం. చుట్టూ వాతావరణం భయంకరంగా కనుపించింది.

తను వున్నది సత్రంలో అని గుర్తించాడు. దాపునే పండుకొన్న సుందరమ్మాత్రం దగ్గుతోవచ్చి ఖంగు ఖంగుమని దగ్గుతూ చుట్టలు చుట్టుకొని మెలికలు తిరిగిపోతూ యమయాతన పడుతున్నాడు. అతన్నిచూచి చాలా జాలిపడ్డాడు. అయినా ఏమీ చేయగలడు. చనిపోతాడేమో అని భయపడ్డాడుకూడా.

రాత్రి రెండు గంటలై వుంటుందని వూహించాడు. దగ్గరలోవున్న రైల్వే స్టేషనుకు ఏదోబండి అప్పుడే వచ్చి సత్తుకొద్ది అరిచి ఆగింది. సత్యం మనసు బండి ఇంజనులా బుసలు కొట్టింది బలంగా గాలి పీల్చాడు.

సత్రంలో చిక్కని చీకటి అంతా చీకటిమయం! తనచుట్టూ చీకటి తనలో కటిక చీకటి కాఱుమేఘాల హోరుగాలి ప్రళయ తాండవం, జీవితంలో అన్నీ పోగొట్టుకున్న తను. తనెందుకు జీవిస్తున్నాడు? ఎవరి కొరకు దేన్నిపుద్ధరించాలనే ప్రశ్నలు మదిలో మెదిలాయి సత్యానికి

"అసలు అర్థంలేని జీవితం వ్యర్థం! నిరాశా నిస్పృహాలతో జీవించే కంటే నిశ్చింతగా చచ్చిపోతే!...నిజమే మరి...! అయినా తనెందుకు

పిరికి పందలా చనిపోవాలి? చచ్చి దేన్ని సాధించాలి ఏ బలీయ కారణమైతే తనను ఇంతకాలం చనిపోకుండా గాలిలో దీపంలా రెప రెప లాడుతూ అపుచేయ గలిగిందో ఆ కార్యాన్ని సాధించకుండా చనిపోవడంలో అర్థమేమిటి అనుకున్నాడు. కసిగా పిడికిలి బిగించాడు పళ్ళు పట పట నూరాడు విరాశగా ఆకాశం వైపు చూశాడు తన జీవితంలా శూన్యంగా అవుపించింది ఆరిపోబోయే దీపానికి వెలుతురు వస్తున్నట్టుగా గొప్ప వెలుగుతో పైనుండి ఓ తోక చుక్క రాలిపోయింది. గుడ్లగూబ భయంకరంగా అరుచు కుంటూవచ్చి సత్రానికి ఎదురుగా వున్న చింతచెట్టు మీద వాలింది. ఆ చిక్కని చీకటిలో దాని కళ్ళు చింత నిప్పుల్లా మండి పోతున్నట్టున్నాయ్. సత్యం మనసులో సముద్ర తరంగాలలాటి వూహాలు వువ్వెత్తుగా లేచి పడుతున్నాయ్ పదిమిదేళ్ళ నాటి భయంకర సంఘటన అతని కళ్ళకు సినిమాలా అవుపించ సాగింది.

ఆ రోజు శుక్రవారం. తన బంగారు 'బాబు వంశోద్ధారకుడు పుట్టిన రోజు తనెంత సంతోషించాడు. 'శాంతి బాబు పుట్టినరోజు పార్టీకి నీ ఇష్టమైన లైట్ రోజ్ బెనారస్, బాబుకు మంచి డ్రెస్ పట్టుకొచ్చాను చూశావా? త్వరగా రావాలి మరి ఓహో ఇది కట్టుకుంటే నువ్వెంత అందంగా వుంటావనుకున్నావు శాంతి అబ్బ! నీ అందాన్ని కనివినీరా చూడాలని హృదయం తహతహలాడుతుంది." అని ఆప్యాయంగా చూచాడు.

"మీరీమధ్య కవిత్వంకూడా నేర్చుకున్నట్లుగా నన్ను తెగ పొగిడేస్తున్నారేమండీ. నన్ను రోజూ చూస్తున్నారుగా!' అని కళ్ళు తాటిస్తూ భర్తవంక లాలనగా చూసింది.

"నీ అందం నీకేం తెలుసు శాంతీ! నా కళ్ళతో చూడు. అజంతా, ఎల్లోరా గుహల్లో జీవంతో తొణికిసలాడుతున్న శిల్పసుందరాంగులు నీ అందం ముందు ఎందుకూ పనికిరారంటాను. నీలాటి అందాలరాశి నాకు భార్యగా లభించటం నా అదృష్టమనుకుంటున్నాను. చాల గర్విస్తున్నాను కూడా!" అన్నాడు.

"అదృష్టం మీదికాదు. మీ వంటి పవిత్ర మనసులు, నిష్కల్మష హృదయులు నాకు భర్తగా లభించటం నేను చేసుకొన్న పుణ్యాన్నిబట్టి మీరు దొరికారు. నా జన్మ తరించింది. ఎన్ని జన్మలకైనా మీరే నాకు భర్తగా వుండాలని భగవంతుని ప్రార్థించుకుంటున్నాను" అని సాదరంగా చూచింది.

"శాంతీ...! ఎంత మంచిదానవు" అంటూ తన హృదయానికి హత్తుకున్నాడు. క్షణకాలం ఇరువురూ ఏ దివ్యలోకాల్లోనో విహరించారు.

ఇంతలో 'అమ్మా...!" అంటూ రెండేళ్ళ బాబు అక్కడికి రావటంతో ఇరువురూ వూహల నుండి తేరుకున్నారు

'బాబూ...!" అంటూ శాంతి హృదయానికి హత్తుకుంది బాబును. ముద్దులు అందించాడు బాబుకు సత్యం.

చూడండీ! మనం మిలా ప్రేమకలాపంలో వుంటే ఇంటికిరాబోయే అతిథులకు బాగామర్యాద చేయగలమనుకుంటాను." అంది నవ్వుతూ.

"అవును శాంతీ మనమాటలో ఆ మాటే మరచాను" అంటూ అక్కడినుండి అతిథులకు చేసే కార్యక్రమాల్లో మునిగిపోయారు.

ఆరోజు సాయంత్రం నాలుగుగంటలకు రావలసిన వారంతా సత్యం ఇంటికి వచ్చారు.

'బాబు' పుట్టినరోజు పార్టీకి రకరకాల కానుకలు పట్టుకొచ్చారు. పార్టీ అతి వైభవంగా జరిపారు. వచ్చినవారంతా ఉచితమర్యాదలు పొంది బాబుకు శుభాకాంక్షలు తెలిపి వెళ్ళిపోయారు

ఆరోజు శాంతి, సత్యం హృదయాలు సంతోషంతో గోదావరి వరదలాగా పరవళ్ళుతొక్కినయ్

ఆ రెండవరోజు ఉదయం హడావిడిగా డ్రెస్ చేసుకుంటున్నాడు. ఇంతలో శాంతి వచ్చింది.

'అంతత్వరగా బయలుదేరుతున్నారు ప్రయాణమెక్కడికో' లాలనగాచూస్తూ అడిగింది

నీకు తెలియందేవుంది శాంతీ డ్యూటీ. తరువాత నీవు బాబు అని చిలిపిగాచూస్తూ చిరునవ్వు నవ్వుతూ చిటికవేశాడు బుగ్గమీద

'నయాగరా" జలపాతంలా శాంతి గలగల నవ్వింది సత్యంహృదయం ఉయ్యాలలూగింది.

ఈరోజు కూడా శలవు వ్రాయండి. అలా 'నందిని వైపు షికారువెళ్దాము" అంది

పాములమెలికల్లా వంపులుతిరిగి మిట్టపల్లాలతో కూడిన నందిని' రోడ్డుమీద కారులో షికారంటే శాంతికి చాలా ఇష్టమని సత్యానికితెలుసు చెప్పుకోదగ్గంత విశేషాలులేకున్నా శాంతికిమాత్రం, అలాటి ప్రశాంత వాతావరణంలో కాలం గడపడం ఎంతో హాయిగా వుంటుంది

'శాంతీ! నిన్న ఒక్కరోజు సెలవు దొరకడానికే ఎంతో కష్టమై పోయింది. ఒక బాధ్యత కలిగిన ఆఫీసరునై వుండి నేను పోకుంటే అక్కడ ఎంతమంది బాధ పడేది. నీకు తెలియదు మన ఒక్కరి సంతోషంకొరకు ఎవరూ ఎప్పుడూ బాధపడకూడదు బాధ్యత గుర్తించిన ఆఫీసరు ఎదుటివారి కష్టం అర్థంచేసికొని ఆదరించాలి" అని మృదువుగా చెప్పాడు

మీ ఇష్టం, మీ గౌరవమే నా గౌరవము. మీ సుఖమే నా ప్రాణం, త్వరగా రావటానికి ప్రయత్నించండి. మీరు వచ్చాకే పోదాము

ఓ. కే. అలా వీలుగాని పరిస్థితిలో డ్రైవరుతో కారు పంపిస్తాను బాబును తీసికొని షైరుగా వెళ్ళిరండి.

'మీరు లేకుండానా...' అర్ధోక్తిలో ఆపింది.

"వస్తాలేదు శాంతీ! వస్తా టా! టా!!" అంటూ కారు డోరుతీసి స్టీరింగ్ మీద చేయివేశాడు బాబు తన చేతితో పట్టుకొని తీయగా నవ్వుతూ 'టా...! టా,!' చెప్పింది శాంతి.

పున్నమి చంద్రునిలా కలకల లాడుతున్న భార్యను చూస్తూ. చిరునవ్వులు చిందిస్తూ కారుని స్టార్ట్ చేశాడు.

'ఖంగ్, ఖంగ్, మని మెలికలు తిరుగుతూ దగ్గుతూ సత్యం గతస్మృతుల తీయని ప్రవాహానికి ఆనకట్ట వేశాడు సుందరం. వూహాజగత్తు నుండి తేరుకొని గతాన్ని తలచుకొని వల వల ఏడ్చాడు, తన హృదయాన్నెవరో నిర్దయగా చీల్చినట్లుగా విల విల్లాడాడు.

'మీరింకా మేలుకొనేవున్నారా" ఆయాసంతో అడిగాడు సుందరం.

"అవును సుందరం. నీకు దగ్గు విపరీతంగా వస్తుందను కుంటాను "

అవునుబాబూ ప్రాణాలు తోడేస్తుంది.' అని ఆయాసంగా గాలిపీల్చుకొన్నాడు

'బాబూ మీరెంతో మంచివారిలా కనిపిస్తున్నారు. మీకు కష్టంలేకుంటే ఒకవిషయం చెప్పాలను కుంటున్నాను.' అన్నాడు దీనంగా

"తప్పకుండా వింటాను. ఇందులో నాకు కష్టమేముంది 'మీరు నన్నెందుకు రక్షించారుబాబూ మరల యీ నరకకూపాన్ని భరించడానికేనా! బ్రతుకుపై తీపివున్నరోజుల్లో చావుకుభయపడి పిరికిపందలా తప్పించుకుతిరిగాను. ఈనాడు ఆ చావునే కావాలని ఎంతకోరుకున్నా నాకుదూరమైపోతుందిబాబూ ఎంతవిచిత్రం. నిన్నసాయంకాలమువరకు మీరెవరో, నేనెవరినో మనకు తెలియదు, జీవితంమీద విరక్తికలిగి చనిపోదామని బండి కింద పడబోయిన నన్ను మీరెంతో నేర్పుతో తప్పించారు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావడంలేదు. మీరుచెప్పినట్లుగా నావద్దనున్న బిడ్డముఖాన్నిచూచే ఇంతకాలము బ్రతకగలిగాను. ఇకనాకు ఓపిక లేదు. జీవించాలనే కోరికకూడా లేదు. బాబూ " అని ఏడ్చాడు.

దిగులుపడకు సుందరం. నీలో నీవే ఎందుకిలా కృంగిపోతావు విచారించకు." అన్నాడు సత్యం. లేదుబాబూ నాలాటిపాపి ఈ లోకంలో వుంటేనే ఎంతో పాతకం చుట్టుకుంటుంది లోకానికి' అని. ఆయాసంఎక్కువై రొప్పుతూ మాట్లాడలేక పోయాడు

కొంచెం సేపు ఇద్దరిమధ్య ఎలాటిమాటలులేవు. సుందరం పడుతున్న అవస్థనుచూచి సత్యం ఎంతో వ్యథ చెందాడు

తరువాత సుందరమే పిల్చాడు. బాబూ! మీకు కష్టం లేకుంటే కాసిని మంచినీళ్ళిస్తారా!" అని ప్రాధేయ పూర్వకంగా అడిగాడు.

లోటా తీసికొని స్టేషన్ దగ్గరకు పోయి నీళ్ళు తెచ్చి ఇచ్చాడు సత్యం

సుందరం మంచినీళ్ళు తాగి కొంచం తేరుకున్నాడు. ఇలా చెప్పడం మొదలు పెట్టాడు

"ఒక స్త్రీని భంగపరచి ఆమె జీవితాన్ని నాశనం చేశాను బాబూ!"

'ఆమెను. నీకు లోగడ ఏమైనా సంబంధముందా?'

'లేదు బాబూ ఆమె మహా ఇల్లాలు.' అన్నాడు. మళ్ళీ దగ్గుతెర వచ్చి సుందరాన్ని వుక్కిరి బిక్కిరి చేసింది

"అంతమంచి ఇల్లాలు అంటున్నావు కదా. మరెందుకు భంగపరిచావు "

'చేసిన పాపానికి శాపం అనుభవిస్తున్నాను. కామోద్రేకంతో కన్ను మూసుకుపోయి తల్లి లాటి

[మిగతా 37 వ పేజీలో]

అని అనుకొని "అమ్మా! నీవు నగ్నంగా రాజసభకు మూడుసార్లు ప్రదక్షిణం చేయాలి. అంతే ఏమంటావు?

అనగానే ఆ యువతి ఏ సిగ్గు లేక తలూపి "ఇంతేనా ఓ అలాగే మహారాజా!" అని సిగ్గుమాలిన ఆ స్త్రీ సభకు ప్రదక్షిణం చేసింది. "సిచురాలు అన్నిటికీ తెగించింది కొడుకును చంపింది. దీనిని ఉరితీయించండి" అని విజయుడు భటులకు ఆజ్ఞాపించాడు. ఆ దృశ్యం చూసిన సభికులు ఆశ్చర్యపోయారు. ఇంతలో కాశీకి పయనమై వెళ్ళిన మహారాజు వెనుదిరిగివచ్చి తన కుమారుడు తీర్పు యెలా చెపుతాడనే వుద్దేశ్యంతో సభలో మారువేషంతో కూర్చున్నాడు. తీర్పు న్యాయబద్ధం కావటంవల్ల రాజు ఆసనం దించి బయటకొచ్చి సభాముఖాన జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. సభికులు ఆనందించారు విజయుడు ఆ యువతిని వురితీయించి ప్రజలకు ఆదర్శపాత్రుడయ్యాడు. సీతమ్మ మరిదిని ఓదార్చి మరోపిల్లనిచ్చి వివాహం చేయించింది.

చూశారా! ఆడదాని సాహసం. ఎంతకైనా తెగిస్తుంది. కాని అందరూ అలా వుండరు. సీతమ్మవంటి ఉత్తమురాండ్రు కూడా వుంటారు. సీతమ్మలా వుండి, విజయునిలా తీర్పు చెప్పాలి. అప్పుడే దేశం సుభిక్షమై సుఖశాంతియుతమై ప్రశాంతంగా వర్థిల్లుతుంది.

ఎన్నడూలేని యీ అన్యాయం అధర్మం ఎందుకు జరిగిందాఅని ఆలోచిస్తూ మహారాజు కొడుకును దీవించి న్యాయం చెప్పినందుకు సంతసించి కాశీకి వెళ్ళిపోయాడు. విజయుడు వివాహితుడై సుఖంగా జీవయాత్ర సాగించాడు.

★

# మనిషి - మనసు

[34 వ పేజీ తరువాయి]

దనే విచక్షణ కూడా మరచిపోయాను చివరకు ఆమె ప్రాణాన్ని కూడా బలిగొన్నాను. నాయీ పాపానికి నిష్కృతి లేదు బాబూ నన్ను భగవంతుడు కూడా క్షమించడు నా కసలు క్షమాపణే లేదు నేను చేసిన మహాఘోరం నన్ను 'లావా'లా కాల్చి వేస్తుంది." అని ఎక్కెక్కి ఏడవడం మొదలు పెట్టాడు.

ఆఁ ... అంత ఘోరం చేశావా" అని ఆశ్చర్యంగా అడిగాడు. సత్యం.

సుందరం ప్రక్కనే పండుకున్న కుర్రాడు లేచాడు. పరిస్థితిని గమనించాడు.

"ఏడుస్తున్నా వెందుకు బాబా" అన్నాడు.

పాపం! పసివాడికేం తెలుసు సుందరం ఎన్నో సుడి గుండాల్లో మునిగి తేలుతూ వూపిరి పీల్చలేక అల్లాడే విషయం.

"ఏడవటం లేదు బాబూ నీవు పండుకో" అని సముదాయించాడు. దీర్ఘంగా నిట్టూర్చాడు.

"ఏడిమిది సంవత్సరాల నాటి విషయం బాబూ! నేనో అధికారికి కారు డ్రైవరుగా వుండేవాణ్ణి ఆ బాబు. ఆ తల్లీ నన్నెంతో ప్రేమతో చూచేవారు. రోజూ సాయంత్రం వారిద్దరూ షికారుకు పోయేవారు. ఒకరోజు ఆ బాబుకు పనిలో రావటానికి వీలు లేక నన్ను షికారుకు తీసికెళ్ళమన్నారు. నేను ఆమెను షికారుకు తీసుకుపోతూ ఒంటరిగా వున్న ఆమెను చూచి పాడుబుద్ధి పుట్టింది. ఆమె అందం నన్ను పశువుగా మార్చింది. దారిలో నా స్నేహితులను కలుపుకొని, ఆమె ఇష్టంతోనే వేరేచోట దిగుతారని, వీరు నా స్నేహితులని చెప్పి ఒప్పించి నాతో కారులో తీసుకెళ్ళాను" తరువాత చెప్పలేక ఏడవడం మొదలు పెట్టాడు.

"జరిగిన దానికి ఇప్పుడెంత విలపించినా నీవు చేయగలిగిందేమి లేదు. ఆ తరువాత" అన్నాడు ఆసక్తిగా సత్యం.

"చెబుతాను బాబూ కొంత దూరం వెళ్ళిన తరువాత వారికి చెప్పవలసిన విషయాలు రహస్యంగా చెప్పి, ఒకచోట దించాను. నేను ఆమెను. బాబును, ఇంకా కొంచెం దూరం తీసికెళ్ళి, చీకటి పడుతుందనగా కారును వెనుకకు త్రిప్పాను. మెల్లగా వస్తూ మనుషులు మెదలని ప్రాంతం రాగానే కారును ఆపాను."

"డ్రైవర్! కారు ఆపావేం? చీకటి పడి పోతుంది త్వరగా పోనియ్" అంది ఆమె.

"ఇంజన్ కొంచెం ట్రబుల్ ఇచ్చింది అమ్మగారూ" అంటూ ఏదో బాగుచేసినవాడిలా నటన చేశాను. ఇంతలో నా స్నేహితులు వచ్చారు. ఆమె ఎంత పెనుగులాడినా, ఎంత మొరపెట్టినా వినిపించుకోకుండా పశువుల్లా ఆమెపైబడి భంగపరిచాము బాబూ. మా కసాయి చేతుల్లో ఆ బంగారు తీగలు పూవులా నలిగిపోయింది. మా క్షణికోద్రేకము తీరిన తరువాత ఆమెవైపు చూశాను. వస్త్రవిహీనయై చలనంలేకుండా పడివుంది. పరీక్షగా చూచాను. శాశ్వతంగా ఈ లోకానికి దూరమైపోయింది బాబూ! నామీద హఠాత్తుగా పెద్దపిడుగు పడినట్లనిపించింది. నేను నిలుచున్న భూమి ఎక్కడికో అగాధంలోకి కృంగిపోయినట్లుగా తోచింది. గుండెను ఎవరో బలంగా వడిసి పిండినట్లనిపించింది బంగారంలాటి 'బాబు' గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. బాబు ఏడుపువిని నాలోవున్న రాక్షసత్వం పూర్తిగా మారిపోయింది బాబూ! చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లుయింది నాస్థితి. చేసిన తప్పుకు చనిపోయిన ఆ తల్లి పాదాలమీద క్షమాపణ చెప్పుకున్నాను. నా స్నేహితులు ఎటో పరారైపోయారు. మారువేషంతో, వేరు మార్పుతో దూర దేశంలో ఈ బాబును పెంచుతూ ఇలా కాలం గడుపుచున్నాను బాబూ." అని ఏడుస్తూ చెప్పడం ముగించాడు.

"సుందరం! ఎక్కడ జరిగిందీ విషయం" అని ఆతృతగా అడిగాడు సత్యం.

"భిలాయ్‌దగ్గర నందిని ప్రాంతంలో బాబూ"

"రంగా...! నువ్వా...?" అని బిగ్గరగా అరిచాడు సత్యం. ఆ కేకకు చింతచెట్టుమీదున్న పక్షులన్నీ టపటపమని రెక్కలుకొట్టుకుంటూ లేచాయి. సత్రంలో గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్నవారు ఏదో ప్రళయం వచ్చి పడిందన్నట్లుగా లేచారు.

"ఆఁ .. నాపేరు మీకెలా తెలుసు? ఇంతకూ మీరెవరు బాబూ!" మాటలు తడబడుతూ అడిగాడు.

"ఎవరి జీవనజ్యోతిని సర్వనాశనం చేశావో, ఎవరి కుటుంబాన్ని మొదలంటా కూలద్రోశావో, యజమానిని నీవు బ్రతికుండగా చితిలో వేసికాల్చావో అతణ్ణి... సత్యాన్ని... నేను... నేనే! ఇన్నేళ్ళు నాహృదయం నీకోరకే అగ్నిగుండంలా మండిపోతోంది" అని మహోగ్రుడై లేచాడు.

"బాబూ! సత్యంబాబూ! నన్ను క్షమించండి బాబూ నా పాపానికి ప్రాయశ్చిత్తం నేనే చేసుకుంటాను."

"రంగా ఒకేఒక్క కత్తిపోటుతో నిన్నుచంపి నీవు రక్తపుమడుగులో గిలగిల కొట్టుకుంటుంటే చూచి ఆనందించాలనే మహత్తరతరుణం ఎప్పుడు దొరుకుతుందాని, ఇన్నేళ్ళనుండి నీకొరకే అన్వేషించాను. కాని... మనిషిగా బ్రతికిన నేను నిన్ను నాచేతులతో చంపి, నన్ను మలినపర్చుకొని, పూజ్యురాలైన నా భార్య పవిత్రఆత్మలో తుపానురేపలేను. వెళ్ళిపో తక్షణం వెళ్ళిపో ......" అని అరిచాడు.

తనను తాను అదుపులో పెట్టుకునే ప్రయత్నంలో ఆవేశంతో సత్యం వూగిపోయాడు.

"బాబూ! ఇన్నాళ్ళు నేను సాకినబిడ్డ మీ కన్నకొడుకే బాబూ! నన్ను క్షమించుబాబూ!" అంటూ స్టేషన్‌వైపు పరుగెత్తాడు రంగడు.

గార్డ్ విజిల్ వేస్తూ పచ్చలైట్లు చూపిస్తున్నాడు. రైలుబండి బయలుదేరింది బుసలు కొట్టుకుంటూ.

ఫట్, ఫట్- ఫట్... మనే శబ్దం వచ్చింది. స్టేషన్‌లోని జనం ఘొల్లు మన్నారు. గార్డు విజిల్ వేశాడు. ఎర్ర దీపం వెలిగింది.

★